

# ఆమె...!

– బోయిన భాస్కర్

ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. అపనమ్మకం గానూ తోచసాగింది. ఇన్నాళ్ళు ఘనీభవంగా, ఒక నిర్దిష్ట పరిధిలో గిరిగీసుకుని వున్న తన మనసు అకస్మాత్తుగా స్థానభ్రంశం చెందుతుండడం కొత్తగా, వింతగానూ అని పించసాగింది. ఏదో తెలియని అనుభూతికి మనసు అంతకంతకు దగ్గరవుతోంటే తలవిదిల్చి చేతిలోని వుత్తరాన్ని ఉండజుట్టి చెత్తబుట్టలో పడవేసింది లత. బెడ్ దిగి అటు ఇటు పచార్లు చేసింది. వంటింట్లోకెళ్ళి కాఫీ కలుపుకుని తాగుతూ హాల్‌లోకి వచ్చి టీవీ ముందు కూర్చున్నది. అయినా మనసు లగ్నం కావడం లేదు. తడవకోసారి చలిస్తోంది హృదయం! లయ తప్పుతోంది. ఉండుండి ఎందుకో కంగారు. తప్పుచేసిన దానిలా సర్దుకు కూర్చుని తనను గమనిస్తున్నారేమోనని తల్లిదండ్రుల వంక ఓరగా చూసింది. వాళ్ళు టీవీలో వచ్చే సీరియల్‌లో నిమగ్నమైపోయున్నారు.

మొదటిసారి కలిగిన భావనకు మనసు ఇబ్బందిగా, ఇరుకుగా తోస్తుంటే అక్కడా ఉండలేక తన బెడ్‌రూం వైపు కదిలింది. బెడ్‌పై అదోలా వాలిపోయి గాఢ నిట్టూర్పు వదిలింది. కొలిక్కిరాని ఆలోచనలు ఆమె మెదడులో మరల్లా తిరుగుతున్నాయి. అదే గాక ఏభావనైతే తన మనసులోకి రాకూ డదనుకున్నదో, అదే పదే పదే మనసును హత్తుకుంటూ, సదలిపోతూ దోబూచులాడసాగింది. తనకు ఈడొచ్చిన తర్వాత పదహారు సంవత్సరాలకు తొలిసారిగా కలుగుతున్న భావనకు ఆమె మనసు అదుపు తప్పుతోంది. అంతలోనే తెములుకుని భయంతో బిర్ర బిగుసుకు పోసాగింది. అయినా ఆ తలంపే గుచ్చిగుచ్చి గుర్తుకొస్తూ బలంగా ఆమెను తొలుస్తూ నిలకడగా ఉండనీయలేక పోవడానికి దారితీసిన ఉత్తరాన్ని చెత్తబుట్టలోంచి చేతిలోకి తీసుకుంది లత.

లత గారికి!

నేను కోరే ఈ కోరిక నా స్థాయికి తగ్గది కాదని నాకు తెలుసు. అయినా కూడా నా మనసులోని మాటను మీకు చెప్పేవరకు నేను నేనుగా ఉండలేనేమోనని ఈ ఉత్తరం రాస్తున్నాను. ఈ కాలం ప్రేమలమీద నాకంతగా నమ్మకంలేదు. అందుకే నీమీద కలిగిన ఈ ఇష్టాన్ని ప్రేమగా చెప్పడానికి నాకెందుకో మనస్సంగీకరించడంలేదు. చాలా రోజుల్నుంచి మిమ్మల్ని గమనించాను. మీకు మీరుగా మసలే మీ హుందాతనం నాకు బాగానచ్చింది. అలా మిమ్మల్ని అన్ని కోణాలనుంచి పరిశీలిస్తుంటే మిమ్మల్ని గురించి ఆరాతీస్తే, మీతో నేను ఏవిధంగానూ సరితూగలేక పోయాను. డిగ్రీ కలిగి ప్రభుత్వోద్యోగి అయిన మిమ్మల్ని, ఇంటర్ దాటని ప్రయివేటు ఉద్యోగినైన నేను కోరుకోవడం విడ్డూరమని తెలిసి నా ఆశల మీద నీళ్ళు చల్లుకున్నాను. అయితే అకస్మాత్తుగా ఉమ పెళ్ళిలో మిమ్మల్ని చూడడం, మీగురించి తెల్సుకుంటే, 'మీకు మాకు దూరపు బంధుత్వం ఉందనీ, అందులో కలిసే వరసలు కూడా ఉన్నట్టు' తెలిసి మళ్ళీ ఆశపుట్టింది. ఆ తర్వాత మన మధ్య ఉన్న బంధుత్వం వల్ల మన పరిచయం యాదృచ్ఛికమే అయినా, ఆ తర్వాత అదృష్టవశాత్తు మీ స్నేహ ఘట్టంలో నేను పంచుకున్న సంఘటనలన్నీ మర్చిపోలేని ఆనందామృతాలుగానే వున్నాయి. ఏదైనా సూటిగా, స్పష్టంగా మాట్లాడడం, జీవితం మీద స్థిరమైన పట్టుతో, ప్రతి విషయంలోనూ పూర్తి అవగాహన కలిగివున్న మీ తత్త్వం నన్ను నిజంగా విస్మయపర్చింది. మనసును లగ్నం చేసి అనుకున్న లక్ష్యంతో ఆ దిశలోనే స్థిరంగా పయనిస్తే సాధ్యం కానిదంటూ ఉండదనేది మీ పరిచయ కాలంలో నేను నేర్చుకున్నాను. మీతో ఏ విధంగానూ సరితూగలేని నేను, కేవలం మన మధ్య ఉన్న బంధుత్వం కారణంగానే మొదట కలిగిన ఆశకు జీవం పోసుకున్నాను. అందుకే ఉండబట్టలేక తెగించి ఉత్తరాన్ని రాస్తున్నాను. ఇది అత్యాశే అయినా ఆశాపూరితమైన మనసుతో రాస్తున్నాను. కల్మషం లేని హృదయాలతో కాపురాలు చేస్తారుగానీ, విలువలు, హోదాలతో కాదని నమ్ముతాను నేను. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న నాఆశ సరితూగనిదనుకుంటే నన్నో తెలివి తక్కువ వాడిగా మన్నించు. యధా విధిగా ఓ స్నేహితుడిగా మిగిలి పోతాను.

ఇట్లు
వాసు

యుక్తవయసు కొచ్చినప్పటి నుండి ప్రేమ, పెళ్ళిళ్ళపట్ల అయిష్టతను, జుగుప్సతను పెంచుకుని ఇన్నాళ్ళు బతుకుతూ వచ్చిన లతను ఆ వుత్తరం స్పందింపజేసింది. అందుకే వాసు కోరిన కోరిక మీద అయిష్టాన్ని పెంచుకోలేక, యిష్టాన్ని తుంచుకోలేక సందిగ్ధపడసాగింది. కొలిక్కిరాని ఆలోచనలు చీకటి వెలుతుర్లా దోబూచులాడుతుంటే ఉత్తరాన్ని నునుపుచేస్తూ దీర్ఘాలోచనలో పడ్డది లత.

అపనమ్మకంతో అబద్ధాలతో ఒకరినొకరు మోసం చేసుకుంటూ జీవితాల్ని సాగిస్తున్న కాపురాలు, మోసపోయిన ప్రేమలు, భగ్నమైన ప్రేమలు, కట్నం చావులు, భద్రత వున్నట్టే భ్రమిస్తూ అభద్రతగా బతుకుతున్న జీవితాలు ఎన్నో ఎన్నెన్నో

తనుచూసిన, విన్న భార్యాభర్తల సంబంధాలు కలగా పులగంగా లత కళ్ళు ముందు సుళ్ళుగా కదిలాయి. చిన్నతనంలోనే పెళ్ళనే బంధంతో ఊబిలాంటి కాపురంలో దిగి బ్రతకలేక చావుదప్పి పిచ్చిదయిన తన స్నేహితురాలు మదిలో మెదిలింది. తానెరిగిన పలువురి కాపురాలు, వారిలో తలెత్తే భేదాభిప్రాయాలు, దెబ్బలాటలు, విడాకులు వంటి సంఘటనలు దొర్లాయి. వాటన్నింటికి మూలాలు వెదికింది. స్వార్థం, నమ్మకద్రోహం, మోసం, బాధ్యతా రాహిత్యం, చేతగానితనం వంటి తదితర చెడ్డగుణాలు కాపురాలు సాగించే భాగస్వాముల్లో ఎవరో ఒకరికి ఉండడం వల్లే సంసారాలు స్వర్గధామం కాలేక పోతున్నాయనుకుంది లత. అందుకే తను నిర్ణయం తీసుకునే ముందు ఉత్తరంలోకి మరోసారి తొంగిచూసింది, ఏమైనా లోపాలు కనిపిస్తాయేమోననీ.. కానీ, నిస్వార్థమైన తపన, నిజాయితీ తప్ప ఆ ఉత్తరంలో లతకేమీ కనిపించలేదు. వాసును దగ్గరగా ఎరిగినా, అతన్నోసారి లోతుగా చదవాలని అనుకుంటూ నునుపు చేసిన ఉత్తరాన్ని మడిచి బెడ్‌కింద పెట్టింది చిరుదరహాసంతో... "ప్రేమ ప్రతి జీవిలోనూ నిక్షిప్తమై ఉంటుంది. వివిధ కారణాల వల్ల ఆ ప్రేమను కాఠిన్యంతో, కార్పణ్యాలతో కప్పివేసినా, వాటిని కరిగించే సందర్భం వచ్చినపుడు ప్రేమ తనంతట తానే జీవం పోసుకుంటుంది". ప్రస్తుతం ఆ మార్పే లతలోనూ సంభవించిందేమో!...

"ప్రేమలు పెళ్ళిళ్ళు మీద ఇప్పటికీ నాకు నమ్మకం లేదు. అంత మాత్రాన హృదయం లేని దాన్ని కాదు. నేను చూసిన, ఎరిగిన చాలా మంది ప్రేమలు పెళ్ళిళ్ళు స్వార్థం నిండి సజావుగా సాగక వారు పడే వేదనలను చూశాను. తెలిసి జీవితం నాశనం చేసుకోవడం కన్నా ఒంటరిగా బతకడమే హాయనుకుని ఇన్నాళ్ళు వాటికి దూరంగా ఉంటూ వచ్చాను. అయితే విచిత్రంగా మీ ఉత్తరం నాలో చలనాన్ని కలిగించింది. దాపరికం లేకుండా నిజాయితీగా నీ జీవితాన్ని ఒప్పుకున్న తీరు నన్ను కదిలించింది. కానీ, నాకు కొన్ని నిర్దిష్టమైన భావాలున్నాయి. అవి మీకు నచ్చితేనే పెళ్ళి ప్రస్తావన కొద్దాం.. ఏమంటారు?.." అంది లత.

"తనకంటూ సొంత భావాలుండి, ప్రత్యేకమైన జీవన సరళిని కలిగి ఉంటేనే జీవితం సాఫీగా సాగుతుంది. అలా ఉంటేనే నాకిష్టం. చెప్పండీ...!" లతనే చూస్తూ అన్నాడు వాసు. అతని మాటలు ఆమెకు కొంత ఊరట నిచ్చాయి. ఆ ఊపుతోనే చెప్పడం ప్రారంభించింది. "ఒక మనిషి జీవితం సాగించడానికి తోడు ముఖ్యమనుకుంటే ఆర్థికంగా, కుటుంబపరంగా భాగస్వామిపరంగా ఎన్ని ఇబ్బందు లెదురైనా భరించాలి. ఇష్టం, స్వేచ్ఛ అనే భావాలకు తావు లేకపోయినా, ఉండి అవి అమలు కాకపోయినా సంసారమనే 'బందీ'లో బాధ్యతాయుతంగా, రాజీతత్వంగా తన పాత్రను విధిగా నిర్వహించాలి. ఇప్పుడు సంసారాలన్నీ చెరసాలల్లోనే సాగుతున్నాయి. అందులో అధికశాతం 'బందీలు' ఆడవాళ్ళే! అందుకే చాలామంది ఆడవాళ్ళు సంసారాల్లో తమ పాత్రను నిర్జీవంగా.., నిర్లిప్తంగా, నిస్సారంగా ఈడ్చుకొస్తున్నారు. అందుకు వారివారి జీవన స్థితిగతులు, మానసిక తత్వాలను బట్టి సవాలక్ష కారణాలు వుండవచ్చు. కొందరికి ఆ (భారం) పాత్ర బలవంతంగా రుద్దనూ బడొచ్చు. కానీ, నేనలా భరించలేను. అలాంటి సంసారాన్ని సాగించను కూడా! అందుకే నేను కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. అవి మీరు వినాలి." అంటూ క్షణం మౌనం దాల్చి మళ్ళీ ప్రారంభించింది.

"కల్మషం లేని హృదయాలతో కాపురాలు

## క(త)లలు

మన ప్రణాళికా రచనలన్నీ
కాగితాల్లోని కాకుల్లెక్క!
వేసుకున్న వేషాలతో
లొసుగుల్ని దాచెయ్యొచ్చిక!
తొడుక్కున్న సిద్ధాంతాలతో
బడుగు జనాన్ని ముంచొచ్చు- ఎంచక్కా!
కలలుగంటున్నాం కానీ
తలలు లెక్కపెట్టే దేశంలో
తలసరి ఆదాయం పెరుగుతుందా?

– వారణాసి రామకృష్ణ

చేస్తారుగానీ... అంటూ ఉత్తరంలో మీరు రాశారు. అది నీ స్థితిని బట్టి నీకు కలిగిన భావన. 'ఇచ్ఛతో, అభిమానం నిండిన మనసులతో చేసేవే కాపురాలు గానీ, వాటి ముసుగులో మనుషులు అందమైన అభినయాలతో చేసేవేవీ కాపురాలు కాదని నా వాదన. సంసారంలో మొదటిగా ఉండాల్సింది ఒకరిమీద ఒకరికి పూర్తి నమ్మకం. అలాగే అలవర్చుకోవాలి కూడా. ఇష్టం, స్వేచ్ఛ, భావప్రకటన తదితర అంశాలకు ప్రాధాన్యత వుండాలి. నేను చెప్పిందే వేదమనే మొండి వైఖరికి తావుండకూడదు. బాధ్యతారాహిత్యం అసలే పనికిరాదు. ఇంటిపనుల్ని బయటపనుల్ని సమిష్టిగా పంచుకోవాలి. అవసరమైన పక్షంలో ఒక్కరే భరించాలి. అభిరుచులు, విలాసాలు, అలవాట్లు వ్యక్తిగతంగా ఎలావున్నా విపరీతం కావద్దు. మన జీవన పురోగతికి, విధానానికి సంఘపరిధికి భంగం వాటిల్లకూడదు. సంసారనావలో కపటం, నటింపు, అంతర్గత మధనం, దాపరికం, మౌనం వంటి పోరాటాలు, సాధింపులు ఎవరికీ మంచిది కాదు. మనసులో కలిగింది, తోచింది నిర్భయంగా వెళ్ళగక్కడం, వాటికి సవరింపులను ఇద్దరూ అలవర్చుకోవాలి. ఇకపోతే అన్నింటికన్నా ముఖ్యమైంది మన తల్లిదండ్రుల బాధ్యత. నీకు తల్లి వుంది. నాకూ తల్లిదండ్రులున్నారు. నీ తల్లిని చూసుకోవడంలో నాబాధ్యతెంతో, నా తల్లిదండ్రులను చూసుకోవడంలో నీకూ అంతే బాధ్యత ఉండాలి. జీవన సరళిని, భవిష్యత్ ప్రణాళికలను సమిష్టిగా రూపొందించుకోవాలి. ఇవీ నా నిర్ణయాలు. పెళ్ళయ్యాక ఇందులో దేన్ని ఎవరు వ్యతిరేకించినా, విస్మరించినా అది ఇంకొకరికి నచ్చకపోతే నిరభ్యంతరంగా విడిపోవచ్చు. " అని ముగించి వాసు ముఖంలోకి సూటిగా చూసింది లత. అతనిలో ఒకరకమైన ఆందోళనకర ఛాయ అలా మెరిసి ఇలా మాయమైంది. తేరుకున్న అతను నవ్వుతూ "పెళ్ళికి పెద్దనిర్ణయాలే తయారు చేశావ్! చాలా బాగుంది. నిజంగా ఒక నిర్మాణాత్మకమైన స్త్రీవి నువ్వు! ఒకటిరెండు నిర్ణయాలు కఠినంగా ఉన్నా సంపూర్ణ సంసారానికి మార్గాలని నేను భావిస్తున్నాను. నాకిష్టమే!" అన్నాడు వాసు.

"నీ క్కూడా ఏవైనా నిర్ణయాలుంటే చెప్పు. నా కోసం నీ ఇష్టాల్ని చంపుకుని నా యిష్టాల్ని ఒప్పుకోవాల్సిన అవసరం లేదు."

"ఛఛ...! అలాంటిదేంలేదు. నీలాగా నేను ఇప్పటివరకు ఎలాంటి విధానాల్ని తయారు చేసుకోలేదు. అందుకే నీ నిర్ణయాలు నచ్చాయంటున్నాను." బదులిచ్చాడు వాసు.

"ఎందుకైనా మంచిది, నేను చెప్పినవాటి గురించి మరోసారి ఆలోచించు. టైం తీసుకున్నా పరవాలేదు. ఎందుకంటే నిక్కచ్చిగా వుండేతత్వం నాది. నేను ఎంతగానో పరిశీలించి విశ్లేషించి తీసుకున్న నిర్ణయాలివి. ఇందులో నువ్వు ఏది మిస్సైనా, సరిదిద్దుకోకపోయినా నీ నుండి నేను విడిపోవడానికి వెనకాడను. బతికేందుకు సెంటిమెంట్లను నమ్ముతాను, బలైపోయేట్టుంటే అస్సలు నమ్మను. జీవితమంటే ఒక కమిట్‌మెంట్ ఉండాలని భావిస్తాను. పోనీయ్‌లే అనుకుంటూ ఆత్మవంచనతో బతకడం నాకు చేతకాదు కూడా! అందుకే బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో. ఇష్టమైతే కబురు చెయ్యి ముహూర్తాలు పెట్టుకుందాం!" మరో మాటకు తావీయకుండా విస విసా వెళ్ళిపోయింది లత. ఆ మాటలకు వాసు క్షణంపాటు అచేతనుడైనా తేరుకుని నవ్వుకున్నాడు. తెల్లవారే తల్లితో కలిసి లత ఇంటికి బయలుదేరాడు.

వాసు, లతల పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. సంసారనావలో వారి జీవన యానం మొదలయ్యింది. సహజీవనం అన్యోన్యంగా సాగుతోంది. ఒక్క విషయంలో వాసు అప్పుడప్పుడు అలక తప్పితే అంతా సవ్యమే. పెళ్ళైన రెండు నెలలకు 'పిల్లల్ని కందాం' అన్న

## యాత్ర

ముక్తి కోసం నాడు
భక్తి యాత్రలు
భుక్తి కోసం నేడు
గౌరవ యాత్రలు

– అయినంపూడి శ్రీలక్ష్మి

వాసు మాటలకు 'కనీసం ఒక్క సంవత్సరమైన ఆగుదాం' అని చెప్పింది లత. అందుకు తగిన జాగ్రత్తలు కూడా తీసుకోసాగింది. అలా రెండు మూడు సార్లు తన మనసులోని మాటను అడిగిన వాసుకు చుక్కెదురైంది. కొంచెం అలకకూడా చెందేవాడు. అది తప్పితే వారి సంసారం ఎలాంటి ఆటంకాలు, అరమరికలు లేకుండా సాగుతోంది.

సహజీవనమంటే ఇంత అద్భుతంగా ఉంటుందా!.. సంసారం ఇంత హాయిగా సాగుతుందా... అని ఎన్నో మార్లు తనకు తానే అనుకుంది లత. ఇలా సాగించుకుంటే సాగే కాపురాలను అనవసరంగా పాడుచేసుకుని పరేషాన్‌లో పడతారెందుకో...అని కూడా అనుకున్నది. తానూహించిన, అపోహపడ్డ ఆలోచనలకు భిన్నంగా తన సంసారం సాగడం ఆమెకు ఎనలేని సంతోషం కలిగించసాగింది. అయితే ఊహించినవన్నీ నిజాలు, సంబరపడ్డవన్నీ సంతోషాలు కాదని అతి త్వరలోనే లతకు అర్థమవసాగింది. దేన్నైనా ఇష్టపడి పొందినా, మక్కువతో నిర్మించుకున్నా దాని మీద తొలుత ఎంతో అభిమానంతో మరింత ఆత్మీయతను కనబరుస్తూ అపురూపంగా చూసుకున్నా, క్రమేణా దానిమీద ఆసక్తిని (మర్చిపోతాడు) వదులుకుంటాడు మనిషి. ఈ విపరీతపు ధోరణి, అలవాటు మనుషులకు ఎందుకు అలవడిందో ఇప్పటికీ అర్థంకాదు. ఇష్టం నశించుతుందో, అంతగా అవసరం లేదనుకుంటారో లేక ఎటు పోతుంది పడుంటుందిలేనన్న భరోసా పెంచుకుంటారో తెలియదుగానీ, ఒకింత చులకనగానే తీసుకుంటారు. ఈ భావన ఏదైనా వస్తువుమీదైతే పరవాలేదుగానీ, మనిషి మీదే అయితే పరిణామం తీవ్రతరమే కదా!

వాసూ, లతలిద్దరూ ఉద్యోగస్థులై ఉరుకుల పరుగుల జీవితాన్ని సాగించడం వల్లనేనో, మరింకేమైనా కారణం వల్లనో గానీ క్రమేణా వారిలో అన్యోన్యత కొరవడసాగింది. ఏ కలహాలు లేకున్నా ఇరువురి మధ్య ఇదివరకున్న దగ్గరితనం లోపించసాగింది. వాసులో ఈ మార్పు చాలా వచ్చింది. ఇంట్లో నెలకోసారి మందు కొద్దానని లత వద్ద తీసుకున్న పర్మిషన్ వారానికోసారిగా మారింది. అప్పుడప్పుడు లతతో కలిసి బయటికెళ్ళే అతను క్రమంగా ఒక్కడే వెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. హుషారు, చలాకీతనం మందగించాయి. సంవత్సరకాలంలో చోటు చేసుకున్న ఈ పరిణామాల్ని లత గమనించక పోలేదు. అయితే అవన్నీ ఒకరిని మరీ ఇబ్బంది పెట్టేవిగా లేకపోవడం వల్ల తేలికగానే తీసుకునేది. అప్పుడప్పుడు వాసు ప్రవర్తనకు కారణాలను వెదికేందుకు ప్రయత్నించేది. మందలించాలనుకునేది. అయితే ఒకరోజు జరిగే పరిణామం తిరిగి మరికొన్ని రోజుల వరకు ఉంటుండక పోవడం వల్ల తన ప్రయత్నాన్ని మానుకునేది. పైగా ఈనాటి అత్తగార్లకు పూర్తి భిన్నంగా ఉండే తన అత్తగారి మీద అభిమానంతో కూడా వాసును మందలించలేక పోయేది.

గొంగళి పురుగు సీతాకోకచిలుకలా పరిణామం చెందితే ఆనందిస్తారు గానీ, సీతాకోక చిలుకే గొంగళి పురుగులా మారితే ఎవరు మాత్రం సహిస్తారు. వాసు ప్రవర్తన ఆ దిశగా మారసాగింది.

ఆ రోజు పెందలాడే బెడ్‌రూమ్‌లో చేరారిద్దరు. భార్యాభర్తలకు సంసారంలో ఉన్న సకల సమస్యలను వెల్లడిచేసే వేదిక, పరిష్కార మార్గాలు యోచించే వేదిక దాదాపు బెడ్‌రూమే అవుతుంది. అలాగే మనసుల్లో అగ్నిని రాజేసి స్పర్ధలకు ఊతమిచ్చేది కూడా అప్పుడప్పుడు బెడ్‌రూమే. అయితే సామరస్యం, కాకుంటే ప్రళయాన్ని సృష్టించే ఆ బెడ్ రూమ్‌లోనే వాసు,లతల కాపురమనే టీ కప్పులో తుఫాన్ మొదలైంది. "పిల్లలు కావాలనే కోరిక నాకు బలంగా ఉంది". తన బాహుబంధాల్లో మైమరిచి ఉన్న లతతో అన్నాడు వాసు. " అంత తొందరని నాకు అనిపించడం లేదు. ఇంకొన్నాళ్ళు ఆగుదాం", గోముగా అంది లత."మనం పాతిక సంవత్సరాల జంటం కాదు. వయసై పోతున్నదన్న విషయాన్ని నువ్వసలు గ్రహించడం లేదు.' కాస్త కరుకుగానే అన్నాడు వాసు. ఆ మాటలకు అతన్నుండి విడివడి... "ముప్పై మూడు

సంవత్సరాలకే నేను ముసల్దాన్నైనానా! లేక, ముప్పై అయిదేళ్ళకే నీలో చేవ చచ్చిందా!" చివాలున అన్నది లత. "నువ్వు పొరబడుతున్నావ్? ఐనా... ఇప్పుడు పిల్లల్ని కంటే తప్పేముందీ?" "అదే నేనంటున్నాను. ఇంకొన్నాళ్ళాగుతే నష్టమేముందనీ...!"

"మాటకు మాటనడం ఒక్కటే తెల్సునీకు, మొదట్నుంచి చూస్తున్నాను. ప్రతి మాటా నువ్వే నెగ్గించుకుంటున్నావ్? ఒక్కసారైనా నా మాటకు విలువిచ్చావా? నీకు లొంగి చేసుకున్నాననేగదా చిన్నచూపు". విసుగ్గా అన్నాడు వాసు. "మూర్ఖంగా మాట్లాడకు. మనసులో ఏదో పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నావ్! ఇలాంటి పద్ధతులు అంత మంచిది కాదు." వాసు మాటలకు ఘాటుగానే సమాధానం చెప్పాలనుకున్నా విరమించుకుని వీలైనంత సున్నితంగానే అన్నది లత.

ఆ మాటలకు వాసు నోరు నొక్కేసినట్లైంది. తగువుకు దిగాలనే కోపం వచ్చిందిగానీ, తమాయించుకుని "నువు మాట్లాడితే సిద్ధాంతం. నేను మాట్లాడితే రాద్ధాంతమా...!" ఉలుక్కుంటూ గమ్మున అటు తిరిగి పడుకున్నాడు. వాసు వాలకాన్ని తమాయించుకోలేక పోయింది లత. అకారణంగా అంతలా ఎందుకు ఫీలవుతున్నాడో ఆమెకు అర్థం కాలేదు. ఆ సంఘటనకు నిరసనగా మౌనాన్ని కొనసాగించాడు వాసు. అలా రెండు రోజులు గడిచింది. ఆ రెండు రోజులు రాత్రి ఇంటికి ఆలస్యంగా రావడమేగాక ఫుల్‌గా తాగొచ్చాడు. ఆ తీరు లతకు యింకా ఎబ్బెట్టుగా అనిపించింది. తాను ఏదైతే విపరీతం కాకూడదనుకుందో ఆ ఛాయలు పొడ చూపుతుండడంతో వాటికి పురిట్లోనే అడ్డుకట్ట వేయాలనుకుంది. మూడోరోజు వాసుకోసం కాసుక్కూర్చుంది. రాత్రి పదకొండవుతుండగా వచ్చాడు వాసు. అంతసేపు నిరీక్షణలో రెట్టింపైన కోపంతో కడిగి పారేద్దామని గది తలుపు తీయబోతుంటే "రేయ్ మళ్ళీ ఇదేం మాయ రోగంరా నీకూ...! బంగారం లాంటి కోడలుపిల్ల ముందు నా పరువు తీస్తున్నావ్ కదరా! ఛీఁ ఛీఁ ...! లోగొంతుకతో గట్టిగా అంటున్న అత్తయ్య మాటలు వినిపించి తలుపును ఓరగా తెరిచి బయటకు చూసింది.

"అది కాదే... అదీ... అదీ..." తిరగని నాలుకతో జోగుతూ ఏదో సమాధానం చెప్పబోతున్న కొడుకును వారిస్తూ "తూ... నీ బతుకు చెడ. నోరులేని పశువుకు నీకు తేడా లేదురా! నిన్ను కన్న పాపానికి నన్ను తలెత్తుకుని బతక్కుండా చేస్తున్నావ్ గదరా! ఎందుకురా ఈ బతుకూ... నీ బతుకుల మన్నువొయ్యా...!" అంటూ పైట కొంగుతో కళ్ళువత్తుకుంటూ నిష్ఠూరంగా అన్నది. ఆమాటల్లో కొడుకు బాగుపడాలనే తాపత్రయం, బజారున పడకూడదనే ఆరాటం, అత్తగారిలో స్పష్టంగా కనిపించాయి లతకు.

"అమ్మా...! ఎందుకే నసా! నువు గమ్మున నోరు మూసుకొని పడుకో...!" బూట్లు విప్పుతూ అన్నాడు వాసు. "నోరు మూసుకుంటాన్రా! పెళ్ళికాక ముందు నువు చేసిన ఎదవ పనులన్నిటినీ చూస్తూనే పరువు పోయినా వూరుకున్నాను. ఇప్పుడూ వూరుకుంటాను. కాని ఒరేయ్ ఇంటి గుట్టు బయటేయని కోడలు పిల్ల పరువు నిలపరా! పో... వెళ్ళి గమ్మున పడుకో...!" అంటూ ఎడతెగని దుఃఖాన్ని అదుముకుంటూ తన గదిలోకి వెళ్ళి పోయింది. ఆ మాటలనన్నింటిని విన్న తర్వాత లతలో అంతర్మథనం మొదలైంది. తానూహించిన జీవితం వికృత దిశగా మార్పు చెందబోతున్నదా! అనే నిస్పృహలో... నిస్త్రాణంగా అదోలా వచ్చి బెడ్‌పై వాలింది. కాసేపటికి వాసు వచ్చి నిటారుగా వొరిగి పోయాడు. వెంటనే గురకతో నిద్రలోకి జారిపోయిన వాసును చూస్తుంటే కసి, కోపం, ఏహ్యం, లజ్జా, జుగుప్స, అవమానం, అసహాయత.. అన్నీ ఆలోచనలు లత మనసును వలయంగా చుట్టి మథిస్తుంటే, ఆమెకు ఆ రాత్రి అరనిద్రరాత్రే అయ్యింది.

"అత్తయ్యా! మాకు పిల్లలు కావాలని నీ కొడుకును నువ్వు అడిగావా?!" కూరగాయలు కోస్తున్న శాంతమ్మకు కాఫీ అందిస్తూ అడిగింది లత.

"లేదమ్మా! అలా నేనేం అనలేదు. ఏం... ఏమైందీ!" ఆతృతగా అడిగింది శాంతమ్మ.

"అర్జెంట్‌గా పిల్లల్ని కందామని వాసు నన్ను బలవంత పెడుతున్నాడు. మొన్న మరీ పట్టుబట్టాడు. ఇంకొన్నాళ్ళు ఆగుదామని నేను చెప్పాను. అప్పటినుంచి నా మీద అలిగి ఇలా తెలివి తప్పేలా తాగొస్తున్నాడు. ఓ రకంగా నన్ను సాధిస్తున్నాడనుకో...!" అత్త పక్కనే కూర్చుంటూ చెప్పింది లత. "బాగా చెప్పావమ్మా! వాడి మాటలు నమ్మి పొరపాటున కూడా ఇప్పటి కిప్పుడే పిల్లల్ని కనేయకు! వాడినింకా అసమర్థుడ్ని చెయ్యకు!" అదోలా అన్నది శాంతమ్మ. ఆ మాటలు తన అనుమానానికి బీజం పోసినా.., అంత నిజాయితీగా చెప్పినందుకు అత్తమీద రెట్టింపు గౌరవం, సహకరిస్తుందనే నమ్మకం ఏర్పడింది. ఆ నమ్మకంతోనే "అత్తయ్యా! వాసు గురించి నేను పూర్తిగా తెల్సుకోవాలి. నా పరిచయంలో వాసు చాలా మంచివాడు. అయినా కూడా కొన్ని షరతుల మీద వాటి పరిధుల్లోనే ఇద్దరం సంసారం చేయాలని పెళ్ళి చేసుకున్నాం. కానీ, ఇప్పుడు వాసులో ఏదైనా దుర్బుద్ధి ఉందో, లేక నాటకీయంగానో, కావాలనో మొండిగా ప్రవర్తిస్తున్నాడు. అతని పద్ధతికి నాకేం నష్టం లేదు. నష్టపోయేదల్లా వాసూనే. నా కొడుకు మంచి మనిషిగా బతకాలి. అన్న తపన నీలో చూసి అడుగుతున్నాను. అంతేగాదు... వాసు నాకు మంచి భర్తగా ఉండాలని కోరుకుంటున్నాను" అన్న లతను క్షణం పాటు ఆరాధన నిండిన కళ్ళతో చూసింది శాంతమ్మ. ఆ చూపులో ఒక మెరుపు, ఒక నమ్మకం కొట్టొచ్చినట్టు గోచరించాయి లతకు.

చెప్పడానికే నిర్ణయించుకున్నట్లు ఓ గాఢమైన నిట్టూర్పును వదిలింది శాంతమ్మ. ఇంతలో బయట ఎవరో పిలిచే సరికి ఇద్దరూ అటువైపు కదిలారు. వచ్చినతను కిరాణా కొట్టు సాంబయ్య. అవసరానికి అతని వద్దకు వెళ్ళడం తప్పితే అతడి రాక ఉండదు. అలాంటిది అకస్మాత్తుగా దర్శనమివ్వడంతో ఇలా వచ్చావేం సాంబయ్యా! అని ఆందోళనతో అడిగింది శాంతమ్మ.

"వాసూ లేడామ్మా!" సౌమ్యంగా అడిగాడతను.

" ఇంకా లేవలేదు. ఏదైనా పనా! లేపమంటావా?"

"పరవాలేదు. షాపుకు రమ్మని చెప్పండీ!" అని వెళ్ళిపోబోతూంటే...

"విషయమేమిటో చెప్పండి. ఆయన లేవగానే చెప్తాము" అడిగింది లత.

"రెండు నెలలనుంచి కొట్లో ఖాతా కట్టలేదు. నేనూ సరుకుల వద్ద కట్టాలి. అందుకే వచ్చాను" విషయాన్ని వివరించాడు సేటు.

"ఎంతా?"

"రెండు వేల ఐదొందలు. నేను వచ్చి వెళ్ళానని చెప్పండీ" అంటూ వెళ్ళాడు. ఆ సంఘటనకు మరింత అవాక్కయ్యింది లత.

'నాకొచ్చే జీతంతో ఇంట్లో రేషన్‌ను నడిపిస్తాను. నీ జీతం నీకెలా నచ్చితే అలా, ఏం చేయాలనిపిస్తే అలా చేయ్!" అని పెళ్ళైన కొత్తలో తానే స్వయంగా అన్నాడు వాసు. అలాగే నడుస్తూ వస్తున్నది. అలాంటిది రెండు నెలలుగా ఖాతా


## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

*పత్రిక విడిప్రతి* : ***5/-***
*ప్రత్యేక సంచిక (ఉగాది,దీపావళి)* : ***10/-***
*సాలుసరి చందా* : ***60/-***

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

మోనికా పబ్లికేషన్స్
79బి, జర్నలిస్ట్స్ కాలనీ,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

అలాగే ఉందంటే...?' అతడి జీతం ఏమైందీ... తిండికి ముగ్గురికి నెల ఖర్చు వెయ్యి పన్నెండు వందలుండదు. అతని పదిహేను వందల జీతంలో తన ఖర్చుకు ఇంకా మూడొందలు మిగులుతుంది. అదిగాకా అత్తగారి పింఛన్ ఏడు వందలు అతనే తీసుకుంటున్నాడు. అలాంటప్పుడు ఖాతా దగ్గర డబ్బులెందుకు కట్టలేదు? డబ్బుల్ని ఏం చేశాడు? అన్న ఆలోచనలు కలవరపరుస్తుంటే లోనికి వస్తూ "నీ కొడుకు నిర్వాకం చూశారుగదా! అసలు అతడి ఉద్దేశవేమిటీ? ఇంత బాధ్యత లేకుండా ప్రవర్తిస్తుంటే చూసేవారికి ఏమనిపిస్తుంది. నీ కొడుకు నా నమ్మకాన్ని దగా చేస్తున్నాడు." అంతకంటే ఏమనాలో తెలీయలేదు లతకు.

"నీ రాకతో వాడు మారాడనుకున్నానమ్మా! కానీ, నిన్నూ నమ్మిస్తున్నాడు. ఏ జన్మలో చేసుకున్న పాపమో! వీడి వల్ల మనశ్శాంతి లేకుండా బతుకుతున్నాను." అంటూ కళ్ళనీళ్ళొత్తుకుంది శాంతమ్మ.

"అంటే...?" విస్మయంగా చూస్తూ అడిగింది లత.

"ఒక్కగానొక్క కొడుకనీ, వాడి ఇష్టంగానే నడుచుకునే వాడు వాళ్ళ నాన్న అదే మితిమీరిన పెంపకమయ్యింది. చదువు సరిగా సాగక పోగా చెడు స్నేహాలతో చిన్నప్పుడే అన్ని అలవాట్లు నేర్చుకున్నాడు. అవన్నీ నేను గమనించినా, ఆయన తెలుసుకునేలోగానే ఈ లోకం విడిచి వెళ్ళాడు. దాంతో వీడి దూకుడుకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మనిషి మంచివాడే కానీ, వాడికి లేని అలవాటంటూ లేదు. అన్నీ చెడ్డ అలవాట్లే. ఒకరకంగా వాటికి బానిసయ్యాడు. ఎప్పుడో ఒకప్పుడు తనకు తోస్తే కొద్ది రోజులు కుదురుగా ఉన్నా మళ్ళీ అదే త్రోవలోకి వెళ్ళేవాడు. చెప్పి చెప్పి నా నోరు పడిపోయిందేగానీ, వాడిలో మార్పురాలేదు. వాడి సోమరితనానికి భవిష్యత్ బతుకు మీద ఆశలు వదులుకుని ఆయన సంపాదించిన ఈ కొంపలోనే బతుకుఈడుస్తూ, ఆయన మిగిల్చిపోయిన పింఛన్‌తోనే కాలం వెళ్ళదీస్తూ వచ్చాను. ఏం చేస్తున్నావనీ, ఎటు తిరుగుతున్నావని గానీ వాడిని అడగడమే మానుకున్నాను. ఇక వీడి బతుకింతేనని సరిపెట్టుకున్నాను. తెలిసిన వాళ్ళు, బంధువులు తారసపడి మీ వాడు ఏం చేస్తున్నాడంటే సమాధానం చెప్పలేక చితికిపోయేదాన్ని. వీడికి పెళ్ళవుతుందనీ, అందర్లాగా.. సంసారాన్ని సాగిస్తాడనీ నేను కలలో కూడా ఊహించలేదు. అలా గుండెను రాయిచేసుకుని, వాడిని గురించి మర్చిపోయి నాకు నేనుగా ఉంటున్న తరుణంలో, సంవత్సరంన్నర క్రితం అమ్మా నేనుద్యోగం చేస్తున్నానన్నాడు. నేను నమ్మలేకపోయాను. ఆతర్వాత నిజంగానే ఉద్యోగం చేయసాగాడు. తిరుగుళ్ళమీద, అలవాట్ల మీద, జల్సాల మీద విరక్తి కలిగి ఓ దారిలో పడ్డాడనుకున్నాను. ఆ తర్వాత కొన్నాళ్ళకు పెళ్ళి చేసుకోబోతున్నానన్నాడు. మీ ఇంటికి తీసుకొచ్చాడు. పెళ్ళింది ఇక ఢోకా లేదనుకుని సంతోషించాను. కానీ, కథ మళ్ళీ మొదటికే వచ్చింది! ఏళ్ళ తరబడి గూడుకట్టుకున్న దుఃఖాన్ని వెళ్ళగక్కింది శాంతమ్మ. అంతా విన్న లతకు మతిపోయింది. తానెరిగిన వాసులో ఇంకో మనిషి ఉన్నాడని తెలిసి భరించలేక పోయింది. తాను నమ్మిన విశ్వాసం, తననే వెక్కిరిస్తున్న బాధకు లోనైంది. ఇన్ని రోజుల తన సంసార జీవితంలో భర్త పాత్ర నటింపుగా సాగిందన్న ఆలోచన ఆమెను అతలాకుతలం చేస్తుంటే "మీరిద్దరూ నన్ను మోసం చేశారు. తల్లిగా నువ్వుపడిన బాధను తెలిసి, కావాలని మరో ఆడదానికి రుద్దడానికి మీకు మనసెలా వచ్చింది'' గంభీరంగా మారిపోయి ఏహ్యంగా అన్నది లత.

ఆడదాని బాధకు సాటి ఆడదానిగా స్పందిస్తూ "తప్పమ్మా! నాకు తెలిసి నేను ఏ తప్పూ చేయలేదు. నిజాయితీగా, పద్ధతిగా బతకడంలోనే మనిషికి సార్థకత ఉంటుంది అన్న మానాన్నగారి ఆచరణ జీవితాన్ని అలవర్చుకుని బతకడం మొదలు పెట్టిన దాన్ని. వాసు నాకొడుకే అయినా నా పద్ధతికి వాడు కొడుకు కాదు. బద్ధ విరోధి. వాడికి పెళ్ళి

**ప్రేమ**

అంతం లేని ద్విత్వాక్షర మంత్రం

– బి.వి.రమణ

చేయాలని గానీ, అంతా తెలిసి ఇంకొకరికి గుదిబండగా అంటగట్టి, వాళ్ళ బతుకుల్ని నాశనం చేయాలనీ నేనేనాడూ అనుకోలేదు. ఎవరన్నా వచ్చి నీ కొడుక్కి పిల్లనిస్తామన్నా నేను వాడి గురించి నిజం చెప్పి వద్దనే దాన్ని. అలాంటిది మీరు మీరు కూడుకుని కుదుర్చుకున్న పెళ్ళి ఇది. పైగా అప్పటికి వాసు తనను తాను చక్కదిద్దుకున్నాడని నేనూ నమ్మాను. అందుకే మీ పెళ్ళికి అడ్డు చెప్పలేక పోయాను." తనను నిందించడంలో నా దోషం లేదు అన్నట్టుగా చెప్పింది శాంతమ్మ.

ఆ మాటలకు అన్ని దారులు మూసుకుపోయినట్లైంది లతకు. పరోక్షంగా విన్న నిజాలు, ప్రత్యక్షంగా జరిగిన సంఘటనలు మనసులో బలంగా కదులుతుంటే అన్నింటిని వరసపెట్టి ఆలోచించింది. నాటకీయంగా తన నుండి ఏదో బలీయంగా ఆశించే పథకం ప్రకారం తనను పెళ్ళిచేసుకున్నాడని లతకు క్షుణ్ణంగా అర్థమైంది. ఒక అందమైన మోసానికి తాను బలయ్యానని అర్థం చేసుకుంది. ఇంతలో ఇంకేదో గుర్తుకొచ్చి "ఆఫీసుకు రావట్లేదని ఫోన్ చేసొస్తానని" రివ్వున బయటకు వెళ్ళింది లత. తిరిగొచ్చే సరికి టీ తాగుతూ కనిపించాడు వాసు. అతన్ని చూడగానే ఒక అసహ్యపు ముద్దను చూసినట్లు పరమ వికారం చెందింది. మొన్నటివరకు మహామనిషిలా నటించిన వాసులో భయంకరమైన ఓ మోసగాడు కనిపిస్తోంటే క్రోధంతో కదిలి పోయింది లత.

ఆ విసురుతోనే అతని కెదురెళ్ళి "ఉద్యోగం ఎందుకు మానేశావ్?" తాను తెల్సుకున్న విషయాన్ని సూటిగా అడిగింది. ఆమాట విన్న వాసుకు పాలమారింది. "నేనెందుకు మానేశాను. ఎవరు చెప్పారు" తడబడుతూ అన్నాడు. "నువ్వు ఉద్యోగం మానేసి రెండు నెలలయ్యింది. రెండు నెలలుగా కొట్లో ఖాతా మడత పడ్డది. నీ మట్టుకు నువ్వు మీ అమ్మ పింఛన్‌తో జల్సా చేస్తున్నావు. పెళ్ళికి ముందు మాట్లాడిందేమిటి? నువ్విప్పుడు చేస్తున్నదేమిటి?" రౌద్ర మూర్తిగా మారిపోయి అడిగింది లత. "అక్కడ ఉద్యోగం బాగాలేదు మానేశాను. వేరే చూస్తున్నాను. అంతదానికి ఆరా తీస్తున్నావేంటీ? అయినా నువ్వు చేస్తున్నావ్‌గా! బోడి నేను చేసే ఉద్యోగానికి వచ్చే జీతం నా ఖర్చుకే సరిపోదు. అలాంటి నౌకరీ చేసినా ఒకటే మానేసినా ఒక్కటే!" చెప్పాడు వాసు. అతడి నిర్లక్ష్య ధోరణికి లత అవాక్కైంది. "నోర్ముయ్ వెధవా! ఎద్దులా ఉన్నావ్! ఆడదాని కష్టానికి ఆశపడడానికి సిగ్గుగా లేదురా!" కొడుకు అసలు రూపాన్ని ఎరిగి అన్నది శాంతమ్మ. "కష్టం ఎవరిదైతేనేం అంతా మనకోసమే గదా! ఎప్పుడో ఓ సారి నాకూ అదృష్టం కలిసొస్తుంది. అప్పుడు నాకష్టం అందరిదీ కదా!" అన్న వాసు అసలు రూపాన్ని అర్థం చేసుకున్న లత "ఇంతకూ నామీద ప్రేమతో చేసుకున్నారా! లేక నా జీతంతో హాయిగా బతకొచ్చని పెళ్ళి చేసుకున్నారా!" సూటిగా అడిగింది. " నువ్వెలా అనుకున్నా అది నీ యిష్టం. ఇంత చిన్న విషయాన్ని అంతపెద్దగా ఎందుకు ఆలోచిస్తున్నావో నా కర్థం కావడం లేదు.!" "నా కర్థమైంది. నువ్వొక సోమరిపోతువని బాగా అర్థమైంది. తినడం, తిరగడం, షోకులు, షికార్లు, జల్సాలు ఇదీ నీ బతుకు. వీటన్నింటిని సాగించేందుకు ఆధారం కావాలి. అందుకే వేటాడి ఆరా తీశావ్. నన్ను వంచించి, తెలివిగా నమ్మించి పెళ్ళిచేసుకున్నావ్! మళ్ళీ నీ బతుకును సాగించడం కోసం నన్ను వాడుకోవాలనుకుంటున్నావ్! అందుకే కదూ... పిల్లలు కావాలని పట్టుబట్టింది. పిల్లలైతే సంసార బంధంతో నోరు మూసుకుని పడుంటానని, ఆ తర్వాత నీ రాచరికానికి ఎదురుండదనే కదూ... అందంగా నమ్మించ జూశావ్!..." తనలో రగిలే తామసాన్ని వెళ్ళగక్కుతూ అన్నది లత.

"నువ్వు అనవసరంగా టెన్షన్ పడుతున్నావ్ గానీ, నన్ను అర్థం చేసుకోవడం లేదు. అయినా నిన్ను నమ్మించేం పెళ్ళి చేసుకోలేదు. కాకపోతే నీ అండతో నన్ను నేను మార్చుకోవాలని ఆశపడ్డాను. అది నిజం." కప్పదాటుగా మాట్లాడుతున్న వాసు వాలకానికి లతకు కంపరమేసింది. కోపాన్ని ఆపుకోలేక పోయింది. "అయితే ఈ పద్ధతేనా నువ్వు మార్చుకున్నది. మాటలతో నిన్ను నువ్వు అందంగా

సమర్థించుకుంటున్నావ్ గానీ, నీకు నువ్వే మోసం చేసుకుంటున్నావని తెల్సుకోలేక పోతున్నావ్. నీ బతుకును మార్చుకోలేని అజ్ఞానపు అహంతో ఉన్నావు. ఛీ... ఇంత నిర్లజ్జగా బతికే బతుకు ఓ బతుకేనా!" ఛీత్కారంగా అన్నది.

"నోర్ముయ్! ఏమే ఊర్కుంటుంటే ఎక్కువగా వాగుతున్నావ్. ఇంతకు మించి ఇంకొక్క మాట మాట్లాడినా వీపు పగులుతుంది జాగ్రత్తా!" రోషంతో మీదకొచ్చాడు వాసు. "ఇంత దాక వచ్చావంటే ఇక నీతో వాదన అనవసరం, ఇక్కడ ఉండడం కూడా అనవసరమే...!" అంటూ కదలబోయిన లతతో... "ఏం బెదిరిస్తున్నావా...! ఉండక ఎటెళ్తావ్? ఎన్నాళ్ళుంటావ్? పెళ్ళైన ఆడదానివి మొగుడ్ని వదిలేసి ఎంత గౌరవంగా బతుకుతావో నేనూ చూస్తా...! ఉక్రోషంగా అన్నాడు వాసు.

"నువ్వు లేనప్పుడే గౌరవంగా బతికిన దాన్ని... ఇప్పుడు బతకడం అంత కష్టం కాదు. నాకు కొత్తా కాదు." అంతే రోషంగా అంది లత. "అంటే?... ఏమిటమ్మా నీ ఉద్దేశం... ఇల్లువిడిచి వెళ్ళిపోతే మీ సమస్యకు పరిష్కారం ఉంటుందా!" కోడలు మాటలకు హడలిపోతూ అన్నది శాంతమ్మ.

"మగతనం లేని మొగుడితో సంసారం చేయొచ్చు కానీ, ఇల్లు, తల్లి, పెళ్ళాం మీద ఏమాత్రం శ్రద్ధలేకుండా బలాదూర్‌గా తిరిగే మొగుడితో సంసారం చెయ్యడం, సర్దుకు పోవడం నాకు చేత కాదత్తయ్యా!" ఎంత మాత్రం బాధ్యతగా మాట్లాడని, రాజీ ప్రయత్నంగా మెదలని మొగుడి వాలకానికి చిర్రెత్తిపోయి అన్నది. "ఎంత చెడ్డా మొగుడు మొగుడేనమ్మా! పెళ్ళైన ఆడదానికి అన్నీ భర్తే. వాడిలో ఏమైనా లోవముంటే సరిదిద్దుకోవాలిగానీ, ఇలా పంతాలు పట్టింపులతో వదిలేసిపోతే ఎలా?" సర్దిచెప్పబోయింది శాంతమ్మ.

'పెళ్ళయ్యాక ఆడదానికి భర్తే సర్వస్వం' అన్న ఒకే ఒక విశ్వాసాన్ని తరతరాలుగా ఆడదాని మనసుమీద బలంగా రుద్దడం వల్లే తన ఇష్టాన్ని, స్వాతంత్ర్యాన్ని తుంచేసుకుని, మొగుడు ఎంత అధముడైనా, నీచుడైనా, కర్కోటకుడైనా అతనితోనే బానిసగా బతుకుతూ వస్తోంది ఆడది. ఆమె ఓర్పును అసహాయతగా భావించిన మగాడు ఆమెపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తాను ఆడిందే ఆటగా పాడిందే పాటగా ఆధిపత్యాన్ని చెలాయిస్తూ వస్తున్నాడు. నీ కొడుకు కూడా అదే జాతికి చెందిన వాడు. అంతే మూర్ఖత్వమున్నది. నువ్వు కన్నకొడుకతను. నువ్వే చెప్పు. సంసారానికి ఎంత వరకు అక్కర కొస్తున్నాడు. ఎందుకూ పనికి రాకున్నా...నన్ను బాధపెట్టే అలవాట్లెందుకూ...? పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగానీ పోదంటారు. నీ కొడుకు సంగతి కూడా అంతే! పరాయి కష్టానికి ఆశపడ్డ వ్యక్తి అతను. అస్సలు మారడు. అందుకే అలాంటి వాడితో నేనుండలేను... సంసారం చెయ్యనూ లేను...!" నిక్కచ్చిగా చెప్పింది లత.

"ఏంటమ్మా నువ్వనేది? మమ్మల్ని కాదని వెళ్ళి పోతావా? బంధాల్ని తెంచుకుని వెళ్ళిపోతావా?" కోడలు అన్నదాంట్లో ఎంత మాత్రం తప్పులేకున్నా ఆమె తమ నుండి వెళ్ళిపోవడం ఇష్టంలేక ఆ విధంగా అన్నది శాంతమ్మ.

"ప్రేమతో పెంచుకునేవే బంధాలు... కానీ, తెలివి తక్కువతనంతో నీ కొడుకే తుంచుతున్నాడు. అయినా నేను బంధాల్ని తెంచేయడం లేదు. నీ కొడుకు ధోరణి నచ్చక వెళ్ళిపోతున్నాను. ముందతన్ని మనిషిగా బతకడం నేర్చుకొమ్మనండి... మార్పు రాకుంటే నాకీ బంధమే అక్కరలేదు." అనేసి రివ్వున కదిలి, మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చిన దానిలా ఆగి "అత్తయ్యా! నేను నిన్ను నమ్ముతున్నాను. నీ కొడుకు మారాడని నువ్వు చెప్పేవరకు రాను. అంతేగాదు, నీ కిక్కడ కష్టంగా అనిపిస్తే నాదగ్గర కొచ్చినా కాదనను" అని చెప్పి వెళ్ళిపోతుంటే, ఆ అవమానాన్ని భరించలేక పోయాడు వాసు. కోపంతో రగిలిపోతూ లతను అడ్డగించబోయాడు. కానీ, ఉగ్రకాళిలా నిప్పులు చెరుగుతున్న తల్లి చూపులకు తాళలేక భయపడి తన ప్రయత్నాన్ని ఆపుకున్నాడు. ఇల్లు వదిలి వెళ్ళిపోతున్న లత నిశ్చలమైన నిర్ణయం ఒక మార్పుకు పునాదిగా భావించిన శాంతమ్మ, కోడల్ని గర్వంగా చూస్తుండిపోయింది. ❑